# గ్రీకు ప్రపంచంలో క్రైస్తవ సంఘం

గ్రీకు మతాలు : యేసు జన్మించడానికి కొన్ని వందల సంవత్సరాల క్రితం మధ్యధరా ప్రాంతంల వివిధ మతాలు వేదాంతాలు విరివిగా పుట్టుకొచ్చాయి. ఈ మతాలను వేదాంతాలను అవలంబించేవారు క్రైస్తవులను వ్యతిరేకించడం గురించి క్రొత్త నిబంధన గ్రంథంలో అక్కడక్కడా కూడ కన్పిస్తుంది (ఉదా : 1 కొరింథీ 8; 10; గలతీ 1;6-9;1 యోహాను 2:26,27; ప్రకటన 2:2-6, 14-16,20-25).

ప్రాచీనకాలంలో గ్రీస గొప్ప తత్వ సిద్ధాంతాలకు ప్రసిద్ధి. క్రీ.పూ 330 తర్వాత సిరియా ప్రాంతం అలెగ్జాండరు వారసుల అనుయాయుల ఆధీనంలోనికి వెళ్లింది. సిరియాలోని స్థానిక దేవుళ్లకు దేవతలకు పేర్లు గ్రీకులు మార్చడమే కాదు; క్రొత్త క్రొత్త దైవాలను కూడ ప్రవేశపెట్టారు. తాము పూజించే దైవాల్లో ద్యుపతి ముఖ్యదైవమని గ్రీకుల నమ్మకం. గ్రీకులం అర్తెమిదేవిని, ఐగుప్తీయులు పూజించే ఐసిస్ అనే దేవతను కూడ పూజించేవారు. అయతే, ఐసిస్ ప్రస్తావన క్రొత్త నిబంధన గ్రంథంల మనకెక్కడా కన్పించదు. అయితే, మధ్యధరా ప్రాంతంలో ఆ కాలంలో చాలామంది పంటలు పశుగణాభివృద్ధి ఐసిస్ దేవత అనుగ్రహమని చాలా మంది నమ్మేవారు. వ్యాపారుల ద్వారా సైనికుల ద్వారా వ్యాప్తి చెందిన ఐసిస్ పూజ ముఖ్యమైన మతంగా రూపొందింది కూడ. క్రీస్తు శకం మొదటి మూడు శతాబ్దాల్లో క్రైస్తవ మత వ్యాప్తికి ఐసిస్ భక్తుల నుంచి గట్టి పోటి ఎదురైంది. నాడు అస్క్లెపియస్ అనే ఆరోగ్యదేవత కూడ బాగా పూజలందుకుంది. అయితే, యేసు యెదుట ఈ దేవుళ్లు దేవతలు నిరుపయోగమైనవని తెలియజేయడానికి క్రొత్త నిబంధన గ్రంథకర్తలు యేసు చేసిన స్వస్థతలకు అధిక ప్రాధాన్యత యిచ్చి వుండవచ్చు.

గ్రీకుల ప్రాబల్యం విలసిల్లిన కాలంలో అనేక మార్మికమతాలు, ఉపాసనలు కూడ ప్రాచుర్యంలో వుండేవి. ఈ మార్మిక మతాల్లో కొన్ని నిగూఢమైన నమ్మకాలు వుండేవి. మార్మిక మతాల్లోకి ప్రవేశం కోరుకొనేవారు మొదల్లో కొన్ని రహస్య క్రతువులను పాటించవలసి వుండేది. ఈ రహస్య క్రతువుల వలన నిగూఢమైన కార్యకలాపాలవలన తాము పూజించే దేవుళ్లకు దేవతలకు వున్న 'శక్తి' తమకు కూడ వస్తుందని వీరి నమ్మకం. ఈ రహస్య మతాల్లో గ్రీకుల మార్మిక దేవతలైన డిమేటర్ డియొనైసస్‌ల ఉపాసనలు బహుళ ప్రాచుర్యంలో వుండేవి. ధాన్యం, ప్రకృతిలో వశపరచుకొగల శక్తులు డిమేటర్ దేవత ఆధీనంలో వుంటాయని గ్రీకుల నమ్మకం. యికపోతే, ప్రకృతిల ఎవరూ వశపరచుకోలేని శక్తులు, మద్యం డయొనైసస్ ఆధినంలో వుంటాయని వీరి నమ్మకం. డియొనైసస్ ఉపాసనలో అర్పించే బలిపదార్థాల్లో

(బహుశా నరబలి  కూడ) డియొనైసస్ ఆత్మ వుంటుందని ఆ దేవత భక్తుల నమ్మకం. వీరు ఈ బలిభోజనాన్ని 'ప్రసాదం' గా స్వీకరించేవారు కూడ. ఆ కాలంలో  అనేకమంది ప్రజలు క్రైస్తవం కూడ ఒక మార్మికమతమని అపోహపడ్డారు. యేసు శరీరానికి ఆయన రక్తానికి సాదృశ్యాలైన రొట్టెను ద్రాక్షారసాన్ని క్రైస్తవులు ప్రభువు రాత్రి భోజనంగా స్వీకరించడం (మార్కు 14:22-24) బహుశా యితరులు యిలా అపోహపడడానికి కారణమై వుండవచ్చు. డియొనైసస్ తన భక్తులకు 'మరోజన్మ' ను కూడ యిస్తుందని ఆ దైవాన్ని కొలిచేవారి నమ్మకం. యేసు తనను వెంబడించేవారి జీవితాలను నూతనపరచి వారికి నూతన జీవాన్నిస్తాడని (యోహాను 3:1-21) క్రైస్తవులు బోధించడం కొందరికి పైవిధంగానే కన్పించి వుండవచ్చు.

క్రీస్తు శకం మొదటి శతాబ్దానికి చెందిన మరికొన్ని యితర మతవిశ్వాసాలకు విధి  అదృష్టం జ్యోతిషం గారడి వంటివి ఆధారం. టైకె (అదృష్టం) అందరిపైనా వున్న దేవుడని కొందరి నమ్మకం. మనుషుల జీవితాలను నిర్దేశించేది కూడ ఈ దేవుడేనని కూడ నమ్మేవారు.  ఎవరికైన బాగా  సిరిసంపదలు చేకూరితే, అదిటైకె అనుగ్రహమని నమ్మేవారు. హఠాత్తుగా  ఆ వ్యక్తి సిరిసంపదలను కోల్పోయినట్లయితే, అదికూడ టైకె  ప్రభావమేనని నమ్మేవారు. అలాగే, మరికొందరు 'విధి' ని నమ్మేవారు. విశ్వంలోని సమస్తం మనుషులు చేసే పనులతో సహా అన్నీ 'విధి' నిర్ణయాలేనని , భూతభవిష్యత్‌కాలాలు 'విధి' ఆడించే వింతనాటకమని 'విధి' భక్తుల వింత నమ్మకం.

ఈ నమ్మకాలే జ్యోతిషానికి దారి తీశాయి. సూర్యుడు చంద్రుడు గ్రహాలు మనిషి జీవితాన్ని శాసిస్తాయని జ్యోతిష్యాన్ని నమ్మేవారి అభిప్రాయం. ప్రాచీన కాలంలో గ్రీసులో రాశిఫలాలు జాతక చక్రాలు అన్నీ వాడుకలో వుండేవి. వీటి సహాయంతో రాబోయే రోజుల్లో జీవితంలో ఏం జరగబోతుందో జోస్యం చెప్పేవారు. జ్యోతిషం రాశిఫలాలు జాతకం - యివేమీ  గిట్టని వారు మంత్ర తంత్రాలపై  గారడిపై చూపు నిలిపారు. తాయెత్తులు రక్షలు మంత్రపుకట్లు - వీటి సాయంతో తాము దుష్టశక్తులను పారద్రోలగలమని కొందరు చెప్పుకొనేవారు.  క్రొత్త నిబంధన  కాలంలో కూడ తాయెత్తుల ప్రభావం బాగానే వున్నట్లు కన్పిస్తుంది.

గ్రీకు వేదాంతాలు : క్రీస్తు పూర్వం మూడు నాటుగు శతాబ్దాల్లో గ్రీసులో సోక్రటిస్ ప్లేటో అరిస్టాటిల్ వంటి వేదాంతులు వుండేవారు. 'ప్రజాజీవనంలో శ్రావ్యత'  పొందికైన సంస్కృతి' 'ప్రకృతితో ఐకమత్యం' - యిదే వీరి వేదాంతసారం. వీరి శిష్యులు కూడ తర్వాతి కాలంలో తత్వవేత్తలుగా కొనసాగారు. మధ్యధరా ప్రాంతంలో క్రైస్తవసంఘం ఆవిర్భవించి వృద్ధి చెందుతున్న కాలంలో క్రైస్తవ రచయితల్లో మలి తరానికి చెందిన వారిపై ప్లేటో అరిస్టాటిల్ అనేవారి ఆలోచనల ప్రభావం కన్పించడం విశేషం.

ఏథెన్సుకు చెందిన సోక్రటీసు క్రీ.పూ469-399 మ:ద్య కాలంలో జీవించాడు. సోక్రటీసుకు ముందు కాలంనాటి గ్రీకు వేదాంతులు ఈ విశ్వానికి 'మూలం' ఏమిట తెలుసుకోవాలని ప్రయత్నించారు. అయితే, సోక్రటీస్ దృక్పథం వేరు. సత్ప్రవర్తనే వేదాంత సారమని సోక్రటీస్ నమ్మకం. సోక్రటీస్ తన అభిప్రాయాలను రెండు వేర్వేరు సిద్ధాంతాల్లో ప్రతిపాదించాడు. మొదటిది : 'అనుమేయ' న్యాయం. స్పష్టమైన (లేక, విశేషమైన) ఉదాహరణల (లేక, దృష్టాంతాలు) ద్వారా సర్వజనసమ్మతమైన (లేక, సాధారణమైన) ప్రతిపాదనలను (లేక, ముగింపులను పరిష్కారాలను) చూపించగలగడమే 'అనుమేయ' పద్ధతి. సోక్రటీస్ ప్రతి పాదించిన మరో పద్ధతి. 'నిర్వచన' పద్ధతి. ఒక వస్తువులేక పదార్థానికుండే స్వాభావికమైన గుణగణాలను వర్ణించడమే నిర్వచన పద్ధతి.

తార్కిక ధోరణితో కూడిన చర్చలే 'మీమాంస' (గతితార్కిక శాస్త్రం). ప్రశ్న జవాబు తర్కం లో ప్రధానం. ధర్మంలో (లేక, సుగుణం, నీతి, సౌశీల్యత, సదాచారాం, పుణ్యం) సోక్రటీస్ కున్న ఆసక్తిని బట్టి అతణ్ణి 'నీతిశాస్త్ర' స్థాపకుడుగా పరిగణిస్తుంటారు.

ప్లేటో : సోక్రటీస్ శిష్యుడు ప్లేటో 'అకాడెమీ' అనే వేదాంత పాఠశాలను ప్రారంభించాడు. ప్లేటో ప్రారంభించిన పాఠశాల దాదాపు తొమ్మిది వందల సంవత్సరాల పాటు కొనసాగింది. ప్లేటో బోధలు (డయలాగ్స్) పాశ్చాత్త నాగరికతా చరిత్రలో బాగా పేరు గడించిన రచనలు. విశ్వానికి 'హేతువు' లేక ఉద్దేశం (గ్రీకులో 'లోగోస్') ఆధారమని, సృష్టిలో సమస్తానికి హేతు వే 'మూలమని' ప్లేటో నమ్మకం. చరాచర జగత్తులో 'మార్పులేని' 'మారని' 'అక్షయమైన' అంశాలు 'మారుతున్న' 'క్షయమైన' అంశాల్లో ప్రతిబింబిస్తుంటాయని ప్లేటో పరిశీలన. ప్లేటో ఈ పరిశీలనలనే భావనలు అని పిలిచాడు. మనం ఏదైన ఒక స్వభావాన్ని లేక ఒక గుణాన్ని ఒక పేరుతో పిలిచినప్పుడు (ఉదా : అందం, ధైర్యం), ఆ స్వభావానికి ఆ గుణానికి ఒక శాశ్వతైన భావన ఏర్పడుతుందని ప్లేటో పరిశీలన. విశ్వానికి మూలమైన భౌతిక నియమాల కు పదార్థాలకు ఈ భావనలు అర్థవంతమైన నేపథ్యాన్ని గోచరింపజేస్తాయన్నది ప్లేటో నమ్మక ం. ప్లేటో 'ఆత్మ అమర్త్యత'ను కూడా నమ్మాడు. 'శరీరం' కన్నా 'ఆత్మ' శ్రేష్టమైనదని ప్లేటో భావన. మనిషిల 'ఆత్మే' ప్రధానమైనదని, కాబట్టి మనుషులు విధిగా తమ ఆత్మలను 'కాపా డుకోవలసి' వుందని, అలా కాపాడు కొంటేనే మనుషులు దేవుళ్లకు ప్రీతిపాత్రులు కాగలరని ప్లేటో అభిప్రాయం.

అరిస్టాటిల్ : క్రీ.పూ.384-322 మధ్య కాలంలో అరిస్టాటిల్ జీవించాడు. ప్లేటో వేదాంత పాఠశాల 'అకాడెమీ'లో అరిస్టాటిల్ ఒక విద్యార్థి కూడ. ప్లేటో మరణానంతరం, ఏథెన్సు నగ రాన్ని విడిచిపెట్టిన అరిస్టాటిల్ అలెగ్జాండర్ చక్రవర్తికి బోధకుడుగా వున్నాడు. అరిస్టాటిల్

ఏథెన్సుకు తిరిగి వచ్చిన తర్వాత అతను 'లైకియమ్' అనే వేదాంత పాఠశాలను ప్రారంభించాడు. ఒక వస్తువు (లేక పదార్థం) గురించిన 'అవగాహన' ఆ వస్తువెలా ఆవిర్భవించిందో తెలుసుకోవడానికి ఉపకరిస్తుందని అరిస్టాటిల్ బోధించాడు. ప్లేటోకు అరిస్టాటిల్‌కు మధ్య కొన్ని వ్యత్యాసాలున్నాయి. 'స్వరూపం' పదార్థానికి చలనాత్మకశక్తి నిస్తుందని; దేవుడే అసలు 'స్వరూపం' అనీ; సృష్టించలనాలన్నిటికీ 'స్వరూపమే'' (దేవుడే) 'కారణమని' అరిస్టాటిల్ నమ్మకం. నీతిశాస్త్రం తర్కం స్వాభావిక శాస్త్రాలు రాజనీతి భౌతికశాస్త్రం పద్యం వంటి అంశాలపై అరిస్టాటిల్ బోధనలను అతని శిష్యులు పదిలపరిచారు.

విమర్శకులు : సోక్రటీస్ శిష్యుడైన అంటిస్తెనెస్ ప్రారంభించిన వేదాంత పాఠశాలలోని వారే ఈ విమర్శకులు. అంటిస్తెనెస్ క్రీ.పూ.444-370 మధ్య కాలంలో జీవించాడు. విమర్శకుల్లో నల్ల సముద్ర తీరంలో వున్న సైనోస్ పట్టణస్థుడైన డయొజినస్ ప్రముఖుడు. 'ధర్మం' 'ధర్మం' కొరకేనని, భౌతిక సుఖాలను సంతోషాలను ఆశించకపోవడంలోనే 'ఆనందం' వుందని డయొజినస్ నమ్మకం.

అయితే, వీరిని విమర్శకులు అనే పేరుతో ఎందుకు పిలిచారో స్పష్టంగా తెలియడం లేదు. అయితే, సమాజం అవినీతితో భ్రష్టమైందనే వీరి కఠినమైన విమర్శలే యిందుకు కారణం కావచ్చు. లేక వీరు సమావేశమయ్యే పాఠశాలకు చెందిన బోధకులు ఒక స్థలానికి పరిమితమైన వారు కాదు. వీరు ఒక స్థలం నుంచి మరొక స్థలానికి తరచూ ప్రయాణం చేస్తుండేవారు. బహుశా వీరి సంచార ధోరణినే తొలి క్రైస్తవులు కూడా అనుకరించి వుండవచ్చు. ఏథెన్సులోని, అరెయొపగు సభలో పౌలు ప్రసంగం చేసినప్పుడు అతనొక సంచార బోధకుడని అక్కడివారు తలంచారు (అ.కా.17:16-34).

స్తోయికులు (విరాగులు): కుప్రలోని సిటియమ్ పట్టణస్థుడైన జెనో స్తోయికులకు ఆద్యుడు. యితను క్రీ.పూ.336-261 మధ్య కాలంలో జీవించాడు. గ్రీకు భాషలోని 'స్తోయ పోయకిలె' అనే మంటపం వద్ద జెనో అతని విద్యార్థులు సమావేశమయ్యేవారు. విశ్వమే 'దైవం' అని, జగత్సృష్టికి ఆధారమైన ఏకదేవుణ్ణే వివిధ దేవుళ్ళుగా (పేర్లతో) పిలుస్తున్నారని స్తోయకుల నమ్మకం. సృష్టిలోని 'సహేతుకత'తో 'శ్రావ్యత' (సమతాళం) కలిగి జీవించడమే 'ధర్మం' (లేక 'నీతి) అని స్తోయికుల నమ్మకం. తమ వశంలో వున్నదేదో తమ వశంలో లేనిదేదో మనుషులు గ్రహించ గలిగినప్పుడే వారు 'అంతరంగ ప్రశాంతత' ననుభవించగలరు కాబట్టి మనుషులుకు తమకు అందగలిగిన వాటినే ఆశించాలని స్తోయికుల బోధ. స్తోయికుల సృష్టిపితను 'ధర్మం' అని పిలిచారు. మనుషులు 'సుగుణశీలురై' జీవించాలని, సంపద సుఖం వంటి భౌతిక విషయాలపట్ల 'వైరాగ్యం' చూపాలని, వాస్తవానికి సంపదలు సుఖాలవంటి భౌతిక

విషయాలే మనిషిలోని 'సౌశీల్యత'ను అడ్డుకుంటాయని స్తోయికుల నమ్మకం. 'స్తోయిక్' అనే ఆంగ్లభాషాపదం కూడా యిలాంటి భావాన్నే వెలిబుచ్చుతుంది. స్తోయిక్ అనే ఆంగ్ల పదానికి 'వైరాగ్యం చూపు' అనీ లేక 'నిశ్చింత భావం కలిగివుండు' అనీ లేక 'సమభావం' కలిగివుండు అనీ అర్థం. సహనం క్రమశిక్షన ఆత్మనిగ్రహం స్తోయికుల సుగుణాలు. జెనో స్త్రీ పురుషుల సమానత్వాన్ని కూడా భోధించాడు; బానిసత్వం వుండకూడదన్నాడు. తొలి స్తోయికుల నమ్మకాలకు క్రైస్తవుల నమ్మకాల్లో కొన్ని చాలా దగ్గరగా వుంటాయి. అయితే, స్తోయికులు క్రీస్తు 'దేవుడని' నమ్మలేదు. పునరుత్థానం పట్ల లోకతీర్పుపట్ల కూడా స్తోయికులకు నమ్మకం లేదు. అలెక్జాంఢ్రియకు చెందినఫిలోఅనేయూదుపండితుని (క్రీ.పూ.25 - క్రీ.శ.50) రచనల్లోనూ (ఉదా : 1 కొరింథీ 7:32-35) స్తోయికు నమ్మకాల ప్రభావం కన్పిస్తుంది.

ఎపిక్యూరీయులు (భోగపరాయణులు): క్రీ.పూ.342-270 మధ్య కాలంలో ఏథెన్సులో జీవించిన ఎపిక్యూరస్ అసలైన 'సంతోషాన్ని' పొందడమే జీవితలక్ష్యమని బోధించాడు.

'శాంతం'లోనే 'సౌఖ్యం' (సంతోషం) వుందని 'బాధానివర్తి' 'సంతోషానికి' కారణం కాగలదని ఎపిక్యూరీయుల బోధ. 'విధి' 'కర్మ' - వీటిలో ఎపిక్యూరీయులకు నమ్మకం లేదు. పైగా వీరు స్వేచ్ఛాచిత్తులు. మనిషి జీవితం 'దేవుళ్ల' అధీనంలో వుందని వీరు నమ్మని కారణంగా వీరిని కొందరు 'నిరీశ్వరవాదులు' (నాస్తికులు) అని పిలిచారు. 'ఔన్నత్యం కలిగిన జీవితం' ఆరోగ్యవంతమైన జీవనవిధానం' ద్వారా సౌఖ్యం (సంతోషం) కలుగుతుందని ఎపిక్యూరీయుల అభిప్రాయం. 'భౌతికసుఖాల' కన్నా 'బుద్ధి కుశలత' మేలైనదని ఎపిక్యూరీయుల నమ్మకం. 'సంతోషం' కొరకు మనుషులు ఒకరితో ఒకరు 'స్నేహ సౌహార్ధాలను' పెంపొందించుకోవాలనేది ఎపిక్యూరీయుల ముఖ్య నమ్మకం. 'మృత్యువు' 'స్థితి'కి (ఉనికి) 'ముగింపు' అని; అయితే, 'మృత్యువు'తోనే 'నిమ్మళమైన స్థితి' 'బాధానివృత్తి' సాధ్యమని వీరి నమ్మకం. రమన్ సామ్రాజ్యంలో ఉన్నత వర్గాల ప్రజలకు ఎపిక్యూరస్ బోధల్లో ఆసక్తి మెండుగా వుండేది.

గ్నాస్టికులు : క్రీస్తు శకం రెండు మూడు శతాబ్దాల్లో ప్రాచుర్యంలో వున్న వివిధ మతాలను చరిత్రకారులు 'గ్నాస్టిక్' అనేపేరుతో పిలిచారు. 'గ్నాసిస్' అనే గ్రీకు పదానికి 'జ్ఞానం' లేక 'అవగాహన' అని అర్థం. తమకు 'విశేషమైన' జ్ఞానం వుందని గ్నాస్టికుల నమ్మకం.

'లోకనాథుల' ఆధిపత్యంలో ఈ లోకం వుందని గ్నాస్టికుల్లోని వివిధ శాఖలకు చెందిన వారి నమ్మకం. గ్నాస్టికుల దృష్టిలో పాత నిబంధనలోని 'దేవుడు' కూడా అటువంటి లోకనాథుడే. ఈ 'లోకనాథులు' మనుషులను 'అజ్ఞానం' తోనూ 'బాధ'తోనూ బంధించి వుంచుతారని వీరి నమ్మకం. యేసు 'శరీరధారి' కాడని, ఆయన 'దైవ సంబంధమైన' వ్యక్తి అని,

మనుషుల ఉనికికి మూలమైన నిజదేవుని గురించిన అవగాహనను పునరుద్ధరించడానికి యేసు వచ్చాడని గ్నాస్టికుల బోధ. శరీరం మనస్సు ఆత్మ కలిస్తేనే మనిషి అని, కేవలం 'శరీరాన్ని' దృష్టిలో పెట్టుకొని జీవించేవారు 'మోక్షాన్ని' పొందలేరని గ్నాస్టికుల బోధ. క్రైస్తవులు తమ 'విశ్వాసం' ద్వారా 'నిమ్మన' స్థాయికి చెందిన 'మోక్షాన్ని' (రక్షణ) మాత్రమే పొందగలరని, నిజమైన 'మోక్షం' (ముక్తి) 'ఆత్మకు' 'మనస్సుకు' సంబంధించిన 'శ్రేష్టమైన జ్ఞానం (అవగాహన)' ద్వారానే లభిస్తుందని, వాస్తవానికి 'మనిషి' లోని 'ఆత్మ' 'మనస్సు' అలౌకికమైనవని గ్నాస్టికుల నమ్మకం. క్రీస్తు శకంలోని తొలి శతాబ్దాల్లో గ్నాస్టికుల క్రైస్తవులకు ఒక సవాలుగా నిలిచారు. ఈ గ్నాస్టిక్ నమ్మకాలే క్రైస్తవుల్లో వివిధ శాఖలు ఏర్పడడానికి కారణమయ్యాయి. గ్నాస్టికుల్లో వివిధ శాఖోపశాఖా లున్నప్పటికీ, వీరందరిలో వున్న కొన్ని సాధారణ నమ్మకాలను చరిత్రకారులు పేర్కొన్నారు.

చక్రవర్తి పూజ : క్రీస్తు పూర్వం చివరి శతాబ్దాల్లోని క్రీస్తు శకం తొలి శతాబ్దాల్లోనూ యూదులకు తొలి క్రైస్తవులకు ఎదురైన గట్టి సవాలు 'చక్రవర్తి పూజ'. ప్రాచీన పశ్చిమాసియాలో చాలా భాగాన్ని జయించిన మాసిదోనియకు చెందిన అలెగ్జాండరు చక్రవర్తితో (క్రీ.పూ.356-323) చక్రవర్తి పూజ ఆరంభమైంది. అలెగ్జాండరు తాను దేవుణ్ణని ప్రకటించుకున్నాడు. అతని అనంతరం వచ్చిన రాజుల్లో అనేకులు కూడ అలెగ్జాండరు పంథాలోనే నడిచారు. తమ రాజ్యాల్లోని ప్రజలందరూ తమను పూజించాలని వీరు వత్తిడి చేశారు. వీరిల్లో ఒకడైన అంతియోకస్ నాల్గవ ఎపిఫానెస్ యెరూషలేం దేవాలయంలో ద్యుపతి ప్రతిమను నిలబెట్టాడు. అంతియోకస్ చేసిన ఈ పని యూదుల తిరుగుబాటుకు కారణమైంది. (క్రీ.పూ168-165). తిరగబడ్డ యూదులు యెరూషలేంను దేవాలయాన్ని స్వాధీనం చేసుకొని స్వతంత్ర యూదా రాజ్యాన్ని స్థాపించారు.

క్రీ.పూ.63లో రోమన్లు పాలస్తీనాను జయించారు. రోమన్ చక్రవర్తులు కూడా తమను తాము దేవుళ్లుగా ప్రకటించుకున్నారు.